సాక్షి నిర్మల్

గురువారం । 10 । జూలై । 2025



సమస్య గుర్తింపు ఇక ఈజీ
వివిధ విద్యుత్ సమస్యలు ఈజీగా గుర్తించేందుకు సంబంధిత శాఖ చర్యలు చేపట్టింది. అటవీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా లైన్ ఫాల్ట్ కండక్టర్లను ఏర్పాటు చేసింది. 8లో▸



ట్రిపుల్ఐటీలో ముగిసిన కౌన్సెలింగ్
బాసర ట్రిపుల్ఐటీలో తొలివిడత కౌన్సెలింగ్ ముగిసింది. బాసర, మహబూబ్నగర్ సెంటర్లకు 1,690మంది విద్యార్థులను ఎంపిక చేయగా 1,472 మంది హాజరయ్యారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.0 /24.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

ఆదిలాబాద్టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భగనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతం, సమీకరణాలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. స్థానిక సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలు, రాబోయే ఎన్నికల కార్యాచరణపై సమీక్షించారు. పార్టీని బలంగా తీర్చిదిద్దేందుకు నియోజకవర్గ స్థాయిలో నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, నాయకురాలు ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సోన్: సోన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా ఆధ్వర్యంలో బుధవారం సర్కిల్ క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. సైబర్ నేరాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చోరీలు జరగకుండా విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. సీఐ గోవర్ధన్ రెడ్డి, సోన్, మామడ, లక్ష్మణచాంద ఎస్సైలు గోపి, అశోక్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా అకాడి పూజలు



పూజలు చేస్తున్న గిరిజనులు

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గ్రామాల గిరిజనులు బుధవారం అకాడి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. పిల్లాపాపలు, పాడి పంటలతో తమను చల్లగా చూడాలని పెద్దమ్మతల్లిని వేడుకున్నారు. ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సమీప అటవీ ప్రాంతంలో జంతుబలి చేసి ఆవులను దాటించారు. గిరిజనులు ఆత్రం దేవురావు, కోవ ప్రవీణ్ తదితరులున్నారు.

పోగొట్టుకున్న డబ్బులు అందజేత

నిర్మల్‌టౌన్: పోగొట్టుకున్న డబ్బును ఎస్పీ జానకీ షర్మిల బుధవారం బాధితుడికి అందజేశారు. ఈనెల 8న ఉదయం ఓ వ్యక్తి బైక్ నడుపుతూ.. ఫోన్‌లో మాట్లాడుతుండగా బైక్ పౌచ్ నుంచి రూ.2.48లక్షల నగదు రోడ్డుపై పడిపోయింది. గమనించిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి వాహనదారున్ని పలుసార్లు పిలిచినా వినిపించకపోవడంతో అతడు వెళ్లిపోయాడు. నిజాయతీతో విజయ్‌కుమార్ ఆ నగదును ఎస్పీ జానకీ షర్మిలకు అప్పగించాడు. బాధితుడు ఇంటికి చేరుకున్న తర్వాత డబ్బులు పోగొట్టుకున్న విషయం గ్రహించి వెంటనే పోలీసులను సంప్రదించాడు. దీనిపై ఎస్పీ తక్షణమే ఆదేశాలు జారీ చేసి సాంకేతిక ఆధారాలు సేకరించారు. బాధితుడిని గుర్తించి నగదు అప్పగించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పూజారులు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న గురుపౌర్ణమి ఉత్సవాలు రెండోరోజుకు చేరాయి. బుధవారం వేకువజామునే పూజలు ప్రారంభం కాగా, అర్చకులు హోమ పూజలు నిర్వహించారు. గురువారం ఉత్సవాలు ముగియనుండగా భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు అధికారులు తెలిపారు.

వారసులకు ఉద్యోగాలివ్వాలి



ధర్నా చేస్తున్న వీఆర్ఏలు, జేఏసీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: వీఆర్ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలివ్వాలని వీఆర్ఏల యూనియన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జీపీవోల నియామకాల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం ఇవ్వాలని బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు గౌతు రవి, ప్రధాన కార్యదర్శి మహిపాల్, నాయకులు జానయ్య, మల్లేశ్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

చిత్తశుద్ధితో పనిచేయండి

- అధికారులకు ఎంపీ నగేశ్ సూచన
- సమాచారంతో రాలేదని నిలదీత
- కలెక్టరేట్‌లో దిశ కమిటీ సమావేశం
- శాఖలవారీగా అధికారులతో సమీక్ష



సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన దిశ కమిటీ సమావేశం గరంగరంగా సాగింది. అభివృద్ధి పనులు పూర్తి చేయడంలో అధికారుల అలసత్వం.. సమావేశానికి అధికారుల గైర్హాజరుపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, విద్య, ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన, ప్రధానమంత్రి ఆవాస్, కేంద్రప్రభుత్వం, ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల పురోగతిపై శాఖలవారీగా సమీక్షించారు.

'కేంద్ర' పథకాలు అమలు చేయాలి

గ్రామీణాభివృద్ధి, పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎంపీ నగేశ్ తెలిపారు. అవి పూర్తిస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఆర్టికల్ 275(1), సీసీడీపీ (కంప్రహెన్సివ్ కన్జర్వేషన్ అండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్), ఎంపీసీ (మిషన్ ఫర్ ప్రొటీన్ చెయిన్) లాంటి పథకాల కింద జిల్లాకు వచ్చిన నిధులను సద్వినియోగం చేయాలని సూచించారు. అర్హులందరికీ ఉపాధిహామీ జాబ్‌కార్డులు జారీ చేయాలని, ప్రతీ కూలీకి 100 రోజుల పనిదినాలు కల్పించాలని తెలిపారు. ఉపాధిహామీకి అనుసంధానంగా జిల్లాలో చేపట్టిన రోడ్లు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, డ్రైనేజీ నిర్మాణాలకు అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పనులను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. ప్రధానమంత్రి అమృత్ 2.0, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, పీఎం శ్రీ పథకాలను గుణాత్మకంగా అమలు చేయాలని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద అర్హత కలిగిన రైతులందరికీ లబ్ధి చేకూర్చేలా చూడాలని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఎం శ్రీకి ఎంపికైన పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని, విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల రుణాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమాచారం లేకుండానే..

డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా అధికారులు అరకొర సమాచారంతోనే వచ్చారు. ఎంపీ గోడం నగేశ్ అడిగిన ఏ ప్రశ్నకూ సరైన సమాధానం ఇవ్వలేక పేపర్లు తిరగేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వడం లేదని ఎంపీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో నిర్వహించే దిశ కమిటీ సమావేశానికైనా పూర్తి స్థాయి సమాచారంతో రావాలని ఆదేశించారు. సమాచారమున్నా గైర్హాజరైన శాఖలకు నోటీసులు అందించాలని కలెక్టర్‌కు సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈజీఎస్ కింద అర్హులందరికీ 100రోజుల పని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 926 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 201 కేంద్రాలు ప్రభుత్వ భవనాలు, 367 ప్రైవేట్ భవనాలు, 358 పాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నూతనంగా 36 కేంద్రాలకు భవన నిర్మాణాలకు అనుమతులు లభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 20 భవన నిర్మాణాలు పూర్తి కాగా, మిగతా పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాల్లో 600 మహిళా సంఘాలకు రూ.58 కోట్ల రుణాలు అందించామని తెలిపారు. 130 పంచాయతీ భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 36 భవనాలకు అనుమతులు మంజూరు కాగా, ఇప్పటివరకు 10 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. ఇందుకు రూ.కోటి 13 లక్షల నిధులు ఖర్చు చేసినట్లు వివరించారు. జిల్లాలో రూ.47 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అమృత్ 2.0 పథకం కింద మూడు నీటి ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు లభించాయని, పీఎంశ్రీ పాఠశాలల్లో బోధన నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు 11 సైన్స్ ల్యాబ్‌లు, 29 అదనపు తరగతి గదుల నిర్మాణానికి అనుమతులు లభించినట్లు తెలిపారు. సమావేశంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి



ఫారెస్ట్ అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అడ్డు తగులుతున్నారు. అనుమతులన్నీ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు తప్పించుకుంటున్నారు. అర్హులకు కాకుండా గత ప్రభుత్వంలో ఇళ్లున్నవారికే డబుల్ బెడ్రూంలు మంజూరు చేశారు.

– వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

సర్వీస్ రోడ్డు నిర్మించాలి



బాసర ట్రిపుల్ఐటీలో దాదాపు 8వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. డివైడర్లు, సర్వీస్ రోడ్డు లేక కాలేజీ ఎదుట ప్రమాదాలు జరుగుతున్నాయి. నేషనల్ హైవే అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ముధోల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు అధికారులు కనీస సమాచారం ఇవ్వాలి.

– రామారావు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే

శాశ్వత పరిష్కారం చూపాలి



నేషనల్ హైవే 44లో ఉన్న కడ్తాల్, సోన్ గ్రామాల ప్రజల అభిప్రాయం మేరకు బైపాస్ రోడ్డు పనులు చేపట్టాలి. అధికారులు ముఖ్యమైన పనులను పక్కన పెట్టేసి సీసీ రోడ్లపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

– మహేశ్వర్‌రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే

ఫసల్ బీమా.. ఇవ్వని ధీమా

- పంటనష్టం జరిగితే పరిహారమేది?
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు



లక్ష్మణచాంద మండలం పీచర వద్ద కొట్టుకుపోయిన మొక్కజొన్న (ఫైల్)

లక్ష్మణచాంద: ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో అన్నదాతలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి పంటల బీమా పథకం రాష్ట్రంలో అమలుకు నోచుకోవడంలేదు. మొదట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పథకం అమలులో ఉండేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం అమలులోకి తెచ్చి పంటల బీమా పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది. దీంతో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందక తీవ్రంగా నష్టపోతున్నారు.

కాంగ్రెస్ హయాంలోనూ నిరాశే..

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇంతవరకు పథకం అమలు గురించి పట్టించుకోలేదు. గతేడాది భారీ వర్షాలతో వివిధ రకాల పంటలు దెబ్బతినగా బాధిత రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సాగు ప్రారంభమైనా ప్రభుత్వం ఇప్పటివరకు పంటల బీమాపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

తీవ్రంగా నష్టపోయాం



రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలులో లేదు. గతేడాది భారీ వర్షాల కారణంగా పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయాం. ఇప్పటికైనా ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలులోకి తెచ్చి రైతులను ఆదుకోవాలి.

– భూమేశ్, పీచర, లక్ష్మణచాంద మండలం

ఈసారైనా అమలు చేయాలి



ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు ఆదుకోవాల్సిన పంటల బీమా పథకం అమలులో లేక తీవ్రంగా నష్టపోతున్నాం. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని అమలు చేయాలి. పంట నష్టపోయిన రైతులకు తప్పకుండా పరిహారమివ్వాలి.

– శ్రీనివాస్, పొట్టపెల్లి కే, లక్ష్మణచాంద మండలం

ఇంకా ఆదేశాలు రాలేదు



గతేడాది ఫసల్ బీమా పథకంలో చేరనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా ఇంకా చేరలేదు. ఈసారి కూడా సర్కారు ఇప్పటివరకు అమలుపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రభుత్వ సూచనలు అనుసరించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

ఇక అంతరిక్ష విజ్ఞానం



పొన్కల్ పాఠశాలలోని ఆస్ట్రానమీ ల్యాబ్‌లో ఉపాధ్యాయుడితో విద్యార్థులు (ఫైల్)



సోన్‌లో ప్రయోగశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, డీఈవో రామారావు (ఫైల్)

- అందుబాటులో ఆస్ట్రానమీ ల్యాబ్‌లు
- జిల్లాలో నాలుగు స్కూళ్లలో ఏర్పాటు
- పాఠ్యాంశాల బోధనకు ఊతం
- అనుభూతికి లోనవుతున్న విద్యార్థులు
- ఖగోళశాస్త్రంపై పెరుగుతున్న అభిరుచి

నిర్మల్‌ఖిల్లా: ఖగోళ శాస్త్రంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకు జిల్లాలో తొలి విడతలో నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఖగోళ శాస్త్ర ప్రయోగశాల (ఆస్ట్రానమీ ల్యాబ్) లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా విద్యార్థుల్లో గ్రహాలు, నక్షత్రాలు, ఇతర ఖగోళ వస్తువులపై అవగాహన పెరుగుతోంది. కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రత్యేక చొరవతో ఇప్పటికే సుమారు రూ.20 లక్షలు వెచ్చించి జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఖగోళశాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటయ్యాయి. నిర్మల్ రూరల్ మండలం అనంతపేట కస్తూరిబా బాలికల విద్యాలయం, సోన్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మామడ మండలంలోని పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలు, తానూరు మండలం భోసి ఉన్నత పాఠశాలలో ప్రయోగశాలలు ఇప్పటికే విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

పరికరాలు.. ప్రయోజనాలు

ఖగోళ, భౌతిక శాస్త్ర ప్రయోగాలు, మానవ శరీర ధర్మ శాస్త్రానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని విద్యార్థుల్లో పెంపొందించేలా వివిధ రకాల నమూనాలు, విశ్వాంతరాళం, మానవ శరీర అవయవాల నమూనాలు తదితరాలు ఈ ప్రయోగశాలలో ఉన్నాయి. వాటి ఉపయోగాలివీ..

- ఈ ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానం, ఖగోళ శాస్త్ర విషయాలపై అవగాహన పెరుగుతుంది.
- ఖగోళ శాస్త్ర ప్రయోగశాలలో హైరిజర్వేషన్ టెలిస్కోప్‌లు, వర్చువల్ రియాలిటీ హెడ్సెట్‌లు, స్మార్ట్ టీవీలు, వివిధ శాస్త్రీయ నమూనాల మోడల్స్ అందుబాటులో ఉన్నాయి.
- నేరుగా ఖగోళశాస్త్ర సంబంధిత వస్తువులను గమనించడం, వాటిని స్పర్శించడం, శాస్త్రీయ వైఖరితో ప్రయోగాలు చేయడం, ఖగోళ శాస్త్ర భావనలను అర్థం చేసుకునే అవకాశం ఆస్ట్రానమీ ల్యాబ్‌ల ద్వారా కలుగుతుంది.
- ఖగోళశాస్త్ర విషయాలపై విద్యార్థులకు అభిరుచి పెరుగుతుంది. సైన్స్ అండ్ టెక్నాలజీపై కూడా ఆసక్తి ఎక్కువవుతుంది.
- విశ్వంలోని గ్రహాలు, నక్షత్రాలు, పాలపుంతలు, ఇతర ఖగోళ పదార్థాలను స్వయంగా పరిశీలించిన అనుభూతి ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు కలుగుతుంది.
- విద్యార్థుల్లో ఖగోళ శాస్త్రంపై ఆసక్తితో అన్వేషణ దృక్పథం ఏర్పడుతుంది.

సరికొత్త అనుభూతికి లోనయ్యా



ల్యాబ్‌లోకి అడుగు పెట్టగానే కొత్తగా అనిపించింది. నక్షత్రాలు, తోకచుక్కలు, అంతరిక్షం లాంటివన్నీ చక్కగా అమర్చారు. సైన్స్ పాఠాల్ని ఈ ల్యాబ్‌లో నేర్చుకోవడం ఆసక్తిగా ఉంది. ఉపాధ్యాయులు బోధించిన అంశం ఇక్కడ ప్రయోగాత్మకంగా చూపుతున్నారు. ఇది సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది.

– అర్జున్, పదోతరగతి, జెడ్పీహెచ్ఎస్, పొన్కల్

పాఠం, ప్రయోగం ఇక్కడే..



మా బడిలోని ఆస్ట్రానమీ ప్రయోగశాలలో మా సార్లు పాఠం బోధించడమే కాకుండా ఇక్కడే ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తున్నారు. మాకు కూడా సరికొత్తగా అనిపిస్తోంది. నేర్చుకున్న అంశం శాశ్వతంగా గుర్తుండేలా ప్రయోగశాల దోహదం చేస్తుంది. కొత్త విషయాలు నేర్చుకుంటున్నాను.

– రుచిత్, పదోతరగతి, జెడ్పీహెచ్ఎస్, పొన్కల్

అనుభూతికి లోనవుతారు



ప్రత్యక్ష అనుభవాలు, పాఠ్యాంశం అభ్యసించడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుంది. తద్వారా ఖగోళ శాస్త్రం గురించి నేర్చుకోవాలనే జిజ్ఞాస పెరుగుతుంది. ఆస్ట్రానమీ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష అనుభవాల ద్వారా ప్రత్యేక అనుభూతికి లోనవుతారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– అభిలాష అభినవ్, కలెక్టర్

విద్యార్థులకు పూర్తి ప్రయోజనం



ఇప్పటికే అన్ని రకాల సదుపాయాలతో ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పటిష్టమవుతున్నాయి. కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రత్యేక దృష్టితో జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో ఆస్ట్రానమీ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. ఇవి విద్యార్థుల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్ష విషయాలపై అభిరుచి, ఆసక్తిని పెంచుతాయి.

– పీ రామారావు, డీఈవో

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

- కలెక్టర్ అభిలాష అభినవ్



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, విద్యార్థులందరికీ పాఠశాల స్థాయిలోనే చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలలపై లైంగిక నేరాలకు పాల్పడినవారికి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని తెలిపారు. కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా చట్టం రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నిపుణుడు డేవిడ్ రాజు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, పాఠశాలల నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధికారులు పోక్సో చట్టంపై ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, డీఈవో రామారావు, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మిక వర్గ హక్కులను కాపాడుకుందామని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ల రాజన్న పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ భవన్ నుంచి కార్మికులు ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని కోరారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, అన్ని రంగాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు, కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని, కనీస మద్దతు ధరల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మికశాఖలో తీసుకువచ్చిన పని గంటల పెంపు జీవో 282ను రద్దు చేయాలని కోరారు. బీడీ కార్మికులకు చేయూత పథకం, జీవన భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు మానుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాసాచారి, భూక్యా రమేశ్, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, బ్యాంక్ మేనేజర్ రాథోడ్ శ్రీరామ్‌నాయక్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి, లక్ష్మి, టీయూసీఐ జిల్లా నాయకులు ఎస్.లక్ష్మి, వీ మహేందర్, కిరణ్, గంగామణి, కిషన్, పోశెట్టి, రాజన్న, రాజు, భూమేశ్, రమేశ్, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం



పంచనామా నిర్వహిస్తున్న ఆర్ఐ హుస్సేన్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రంజాన్‌పూర కాలనీలో బుధవారం విద్యుదాఘాతంతో ముబిన్‌ఖాన్‌కు చెందిన కిరాణ దుకాణం దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 11 గంటలకు దుకాణంలో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ముబిన్‌ఖాన్‌కు సమాచారం ఇచ్చారు. అతను వచ్చి దుకాణం తెరిచేలోపే దాదాపు రూ.లక్షా 20 వేల విలువైన సరుకులు దగ్ధమయ్యాయి. ఆర్ఐ హుస్సేన్ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు.

ఇసుక లారీ పట్టివేత



మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

బోథ్: మండల కేంద్రంలో ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు తెలిపిన వివరాలు.. నిర్మల్ జిల్లా సోఫీనగర్ నుంచి ఇసుక లారీ అనుమతి లేకుండా, రాయల్టీ చెల్లించకుండా బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన మాజీద్ అనే వ్యక్తి మండల కేంద్రానికి చెందిన ఇజాజ్ అనే వ్యక్తికి 40 టన్నుల ఇసుక తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

మద్యం తాగిన డ్రైవర్‌పై కేసు

తలమడుగు: డ్యూటీలో ఉండగా మద్యం తాగిన ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ కుడిమేత శంబాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ కుడిమేత శంబాజీ జిల్లాకేంద్రం నుంచి తాంసి మండలం అంబుగాం, గిరిగాం గ్రామాల విద్యార్థులను తీసుకొని వస్తూ సుంకిడి గ్రామ సమీపంలోని వైన్స్‌లో మద్యం తాగాడు. స్థానికులు గమనించి శంబాజీని పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని డ్రైవర్ శంబాజీపై కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు



చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

పెంబి: మండలంలోని నాగాపూర్ గ్రామ సమీపంలో బుధవారం ఖానాపూర్‌లోని కేరళ మోడల్ స్కూల్ బస్సు స్టీరింగ్ పని చేయక చెట్టును ఢీకొట్టింది. ఖానాపూర్ నుంచి పెంబి, మందపల్లి గ్రామాలకు స్కూల్ పిల్లలను తీసుకొస్తున్న క్రమంలో నాగాపూర్ గ్రామ శివారులో చెట్టును ఢీకొంది. స్కూల్ బస్సులో 20మంది విద్యార్థులు ఉండగా పలువురికి స్వల్పంగా, మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఖానాపూర్, నిర్మల్ ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు.

వివాహిత అదృశ్యం

భైంసాటౌన్: పట్టణంలోని ఓ వివాహిత (22) అదృశ్యమైనట్లు ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత మంగళవారం మధ్యాహ్నం పట్టణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసినవారి ఇళ్లలో గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఆమె భర్త రవి బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: బేల మండలంలోని సాంగిడికి చెందిన ఎలాల్ బాలకృష్ణ (26) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బాలకృష్ణ ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఎరోడ్రామ్ మైదానంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు ఫోన్ చేసి తాను పురుగుల మందు సేవిస్తున్నట్లు తెలిపాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ఆయనను చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఎలాల్ గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సమస్య గుర్తింపు ఇక ఈజీ

- విద్యుత్ లైన్లపై లైన్‌ఫాల్ట్ కండక్టర్లు ఏర్పాటు
- సమస్య గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు కొత్త విధానం
- అటవీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి..



అధికారులకు సమాచారం అందజేసే సిస్టం



దోస్త్‌నగర్‌లో ఏర్పాటు చేసిన లైన్‌ఫాల్ట్ కండక్టర్లు

కడెం: అటవీ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుంటాయి. వానాకాలంలో ఈదురు గాలులు సంభవించినప్పుడు విద్యుత్‌లైన్‌పై చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. విద్యుత్ సమస్య ఏర్పడినపుడు సమస్యను గుర్తించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ సిబ్బంది గంటల తరబడి శ్రమిస్తుంటారు. అంతవరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతారు. ఇక నుంచి గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయానికి చెక్ పడనుంది. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు విద్యుత్‌శాఖ అటవీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా లైన్‌ఫాల్ట్ కండక్టర్లను ఏర్పాటు చేసింది. త్వరలోనే ఈ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

12 చోట్ల ఏర్పాటు..

విద్యుత్ అంతరాయాన్ని వెంటనే పరిష్కరించేలా ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు విద్యుత్ సరఫరా అందించే విద్యుత్‌లైన్‌లపై అటవీ ప్రాంతాల్లో లైన్‌ఫాల్ట్ కండక్టర్లు ఏర్పాటు చేశారు. కడెం, పెంబి మండలాల్లోని 33 కేవీ లైన్‌పై ఆరుచోట్ల, కడెం మండలంలోని అల్లంపల్లి, ఉడుంపూర్, ఖానాపూర్ మండలంలోని రాజురా 11 కేవీ విద్యుత్‌లైన్‌లపై సైతం వీటిని ఏర్పాటు చేశారు. లైన్‌ఫాల్ట్ కండక్టర్ల ద్వారా విద్యుత్ సిబ్బంది వెంటనే అప్రమత్తమైవిద్యుత్ సమస్య తలెత్తిన ప్రాంతానికి వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు అవకాశం ఉంటుంది.

పని తీరు ఇలా..

విద్యుత్ సరఫరా నిలిచిపోగానే వైర్లకు ఉన్న మూడు కండక్టర్లు ఎరుపు రంగులో మెరుస్తుంటాయి. లైన్‌ఫాల్ట్ కండక్టర్ల వద్ద విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన సోలార్ సిస్టం ద్వారా లైన్‌మెన్, ఏఈఈ, డీఈఈ, ఎస్ఈ వరకు అంతరాయం సమాచారం అందజేస్తుంది. ఇందుకు సోలార్ సిస్టంలో సిమ్ వేసి ఉంచుతారు. అందులో సేవ్ చేసిన నంబర్లకు సమాచారం వెళ్తుంది. దీంతో పాటు విద్యుత్ లైన్‌కు ఎంత దూరంలో సమస్య ఉందని సమాచారం తెలిపే సిస్టం కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో పూర్తిస్థాయి సేవలు



అటవీ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు పలుచోట్ల విద్యుత్‌లైన్లకు లైన్‌ఫాల్ట్ కండక్టర్లు ఏర్పాటు చేశాం. త్వరలోనే వీటి పూర్తిస్థాయి సేవలు అందుబుటులోకి వస్తాయి.

– ఎం.రాంసింగ్, ఏఈఈ

బాధితుడి నిర్వాకంతో అధికారుల హైరానా



శివాజీని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన ఓ వ్యక్తి కలెక్టరేట్‌లో మూర్ఛ పేరిట కిందపడిపోయి అధికారులు హైరానా పడేలా చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇచ్చోడ మండలం గెర్జాం గ్రామానికి చెందిన శివాజీ అనే వ్యక్తి తన భూ సమస్యను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చాడు. తహసీల్దార్ చాంబర్‌లోకి వెళ్లి మూర్ఛపోయినట్లు కిందపడ్డారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు ఆందోళన చెందారు. ఆర్డీవో వినోద్‌కుమార్ సైతం అక్కడి చేరుకున్నారు. బాధితుడు పడిపోయి ఉండడంతో వివరాలు ఆరా తీశారు. ఆ సమయంలోనే చేరుకున్న కలెక్టర్ రాజర్షిషా బాధితుడిని వెంటనే ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. దీంతో కార్యాలయ సిబ్బంది 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. కాగా తన భూమిని కొందరు కబ్జా చేయగా అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మూర్ఛపోయినట్లు నాటకాలు ఆడినట్లు తెలుస్తోంది. సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత



ఎస్సైకి పర్సు అప్పగిస్తున్న దత్తాత్రి

కుభీర్: దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి దొంతుల పుష్ప అనే మహిళ నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భైంసా వెళ్లేందుకు దొంతుల పుష్ప అనే మహిళ మండల కేంద్రంలోని బస్టాండ్‌కు వచ్చారు. అక్కడ ఆమెకు ఒక పర్సు దొరికింది. అందులో రూ.24,416ల నగదు, వెండి కాళ్లగజ్జలు (ఒక జత), ఇద్దరు మహిళలు, ఒక పిల్లడి ఫొటోలు ఉన్నాయి. ఒక ఫొటోపై యువతి పేరు కవిత అని రాసి ఉంది. కాగా దొంతుల పుష్ప దొరికిన పర్సును తన భర్త దత్తాత్రితో పోలీస్‌స్టేషన్‌కు పంపించి తన నిజాయితీ చాటుకున్నారు. భర్త పర్సును ఎస్సై కృష్ణారెడ్డికి అప్పగించారు. డబ్బు పోగొట్టుకున్న వారు సరైన ఆధారాలు చూపి డబ్బు తీసుకుపోవచ్చని ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య



మహేందర్ (ఫైల్)

దండేపల్లి: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దండేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం నెల్కి వెంకటపూర్ గ్రామానికి చెందిన కోవ మహేందర్ (19) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మద్యానికి బానిసైన మహేందర్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చూపించగా మద్యం మానేసి, మందులు వాడితే కడుపునొప్పి తగ్గుతుందని వైద్యులు చెప్పారు. కానీ మహేందర్ మద్యం మానేయలేదు. ఈనెల 5న కడుపునొప్పి తీవ్రంగా ఉందని, చనిపోవాలని ఉందంటూ అన్న లక్ష్మణ్‌కు చెప్పాడు. తాగుడు మానివేసి మందులు వాడితే కడుపునొప్పి తగ్గుతుందని లక్ష్మణ్ సముదాయించాడు. అదేరోజు మధ్యాహ్నం మందుల కోసం ఇంట్లో నుంచి వెళ్లిన మహేందర్, దండెపల్లి వాగులో పురుగుల మందు తాగి స్నేహితుడు మోకాషి శేఖర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. శేఖర్ వెంటనే లక్ష్మణ్‌కు ఫోన్ చేయగా లక్ష్మణ్ అక్కడకు చేరుకుని బైక్‌పై మహేందర్‌ను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్య పరిష్కరించాలని రైతు ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు డబ్బాతో రైతు గంగాధర్

లక్ష్మణచాంద: తన భూ సమస్య పరిష్కరించడం లేదని ఓ రైతు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మణచాందకు చెందిన రైతు పసుపుల గంగాధర్‌కు 10 గుంటల భూమి ఉంది. దానికి పట్టాపాస్ బుక్ ఉండడంతో పాటు ఏటా వివిధ ప్రభుత్వ పథకాలు కూడా పొందుతున్నాడు. అయితే ఆ భూమిని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి తనదిగా చెబుతూ సాగు చేసుకుంటున్నాడు. తన భూమిని తనకు చూపాలంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదు. మనస్తాపం చెందిన గంగాధర్ బుధవారం మధ్యాహ్న సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా గమనించిన రైతులు, అధికారులు అడ్డుకొని మందు డబ్బా లాక్కున్నారు. అనంతరం తహసీల్దార్ సరిత రైతుతో మాట్లాడారు. దీనిపై సాక్షి తహసీల్దార్ సరితను వివరణ కోరగా రైతు ఫిర్యాదుతో గతంలోనే సర్వేయర్ వెళ్లి పంచనామా నిర్వహించారన్నారు. దానికి రైతు సంతృప్తి చెందలేదని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో డీఐకి, ఏడీ నిర్మల్‌కు చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు ఫిర్యాదు పంపుతున్నట్లు తెలిపారు.

108లో ప్రసవం

భీమారం: పురిటినొప్పులతో గర్భిణి 108 వాహనంలోనే ప్రసవించిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బొగుత శ్రీలత అనే గర్భిణీకి మంగళవారం అర్ధరాత్రి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గర్భిణీని ఆసుపత్రికి తరలిస్తుండగా పోలంపల్లి అటవీప్రాంతంలోకి వచ్చే సరికి నొప్పులు అధికం అయ్యాయి. దీంతో పైలెట్ ముజామిల్ తోపాటు వైద్యసిబ్బంది గర్భిణీకి వాహనంలోనే కాన్పు చేశారు. శ్రీలత మగశిశువుకు జన్మనిచ్చింది. 108 సిబ్బందికి శ్రీలత భర్త అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

గుడుంబా పట్టివేత

వేమనపల్లి: పోలీసులకు అనుమానం రాకుండా బైక్‌పై భార్యతో కలిసి గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన జెరుపుల రాజేశ్ –కల్పన గుడుంబా తయారు చేసి మండల కేంద్రంతో పాటు మంగెనపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంపై తరలిసుంటారు. బుధవారం గుడుంబా తరలిస్తున్నారన్న సమాచారంతో నీల్వాయి నర్సరీ వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బైక్, 40 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బైండోవర్ చేశారు.

నలుగురిపై కేసు..

కోటపల్లి మండలం ఆల్గం గ్రామానికి చెందిన సమ్మయ్య అనే వ్యక్తి తయారు చేసిన 40 లీటర్ల గుడుంబా ప్యాకెట్లను కుమ్మరి సాయికుమార్, శివతేజ అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తరలిస్తుండగా ముల్కలపేట ముసలమ్మ గుడి వద్ద పట్టుకున్నట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపా రు. వీరు ముల్కలపేట గ్రామానికి చెందిన ముత్తక్క అనే మహిళకు గుడుంబా అమ్మేందుకు తీసుకొస్తున్నట్లు అంగీకరించారు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేసి మోటారుసైకిల్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అందుగులపేట వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన గోమాస తిరుపతి (29) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గోమాస తిరుపతి గువ్వల కిశోర్‌తో కలిసి కిరాయి నిమిత్తం మంగళవారం రాత్రి 11 గంటలకు మంచిర్యాల నుంచి తాండూర్ బయలుదేరాడు. మందమర్రిలోని అందుగులపేట ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో తిరుపతి, కిశోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తిరుపతి తమ్ముడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గణేశ్(32) అనే యువకుడు మృతి చెందాడు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణానికి చెందిన గణేశ్ ద్విచక్రవాహనంపై కల్లూరుకు వెళ్తున్నాడు. మాటేగాం గ్రామ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన ప్రకాశ్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మంగళవారం రాత్రి ప్రకాశ్ తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు ఉన్న కిరాణాషాపు ఎదుట నిలిపాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌ను దొంగిలించారు. బుధవారం ఉదయం చూసేసరికి ద్విచక్రవాహనం కన్పించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బాలికల జూనియర్స్ ఫుట్‌బాల్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మరో మూడు రోజులపాటు జరుగనున్న పోటీలకు రాష్ట్రంలోని 12 జిల్లాల క్రీడాకారులు హాజరయ్యారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఫాల్గుణ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలు ప్రారంభించారు. ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్ల వైపు మరలకుండా క్రీడలపై దృష్టి సారించాలన్నారు. సరైన మార్గంలో జీవనం సాగించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఫాల్గుణ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోచింగ్ క్యాంప్ రామకృష్ణాపూర్‌లోనే ఏర్పాటు చేస్తామన్నారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, ఈశ్వరాచారి, బెల్లం శ్రీనివాస్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు లీగ్ పోటీలు..

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న పోటీల కోసం స్టేడియంలో రెండు గ్రౌండ్‌లు సిద్ధం చేశారు. మొదటిరోజు గ్రౌండ్ నంబర్ 1లో నిజామాబాద్ –సిద్దిపేట జట్లు తలపడగా నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ జట్లు పోటీ పడగా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సిద్దిపేట్ మధ్య జరిగిన లీగ్‌లో ఆదిలాబాద్ గెలుపొందాయి. రెండో గ్రౌండ్‌లో మెదక్ –గద్వాల్ జట్లు తలపడగా గద్వాల్, కరీంనగర్ –నల్గొండ జట్ల మధ్య జరిగిన లీగ్‌లో నల్గొండ జట్లు గెలుపొందాయి.

పీహెచ్‌సీలో ప్రసవ వేదన



పీహెచ్‌సీలో వైద్యం కోసం వేచిచూస్తున్న గర్భిణి

వేమనపల్లి: పురిటినొప్పులతో వేమనపల్లి పీహెచ్‌సీకి వెళ్తే గర్భిణీకి వైద్యం కరువైంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని సిరొంచ తాలూకా నర్సయ్యపల్లికి చెందిన కొండగొర్ల సోనియా కాన్పు కోసం మూడు నెలల క్రితం వేమనపల్లిలోని తల్లిగారింటికి వచ్చింది. పీహెచ్‌సీ వైద్యంపై నమ్మకం లేక మంచిర్యాల, చెన్నూర్ ప్రైవేట్ వైద్యుల వద్ద వైద్యపరీక్షలు చేయించుకుంటోంది. ఈ నెల 17వ తేదీన ప్రసవానికి సమయం ఇచ్చారు. కాగా బుధవారం ఉదయం పురిటినొప్పులు రావడంతో వేమనపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో ఏ ఒక్క సిబ్బంది అందుబాటులో లేరు. గత్యంతరం లేక పీహెచ్‌సీలోని బెడ్‌పై పడుకోబెట్టగా తీవ్రమైన నొప్పులతో విలవిలలాడింది. పీహెచ్‌సీలోనే గంటసేపు వేచి చూశారు. కొంతసేపటికి గ్రామంలోనే ఉన్న కాంటిజెంట్ వర్కర్ నిర్మల వచ్చారు. వైద్యాధికారి రాజేశ్‌కు సోనియా అన్నయ్య రజనీకాంత్ ఫోన్ చేసినా స్పందించలేదు. ఇంకా ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని 108 అంబులెన్స్‌లో చెన్నూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సోనియా వైద్యుల పర్యవేక్షణలో క్షేమంగా ఉన్నట్లు భర్త స్వామి, తల్లి గౌరక్కలు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో ముగిసిన కౌన్సెలింగ్



విద్యార్థినికి అడ్మిషన్ పత్రం అందజేస్తున్న అధికారులు

భైంసా: ట్రిపుల్‌ఐటీ బాసర, మహబూబ్‌నగర్ సెంటర్లకు 2025 –26 విద్యా సంవత్సరానికి గాను తొలివిడత కౌన్సెలింగ్ బుధవారం ముగిసింది. మూడవ రోజు ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్‌లు కౌన్సెలింగ్ ప్రారంభించారు. రెండు సెంటర్లలో కలిపి 1690 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 1472 మంది విద్యార్థులు హాజరయ్యారు. గైర్హాజరైన విద్యార్థుల స్థానాలను త్వరలోనే వెయిటింగ్ లిస్టు ఆధారంగా భర్తీ చేస్తామని క్యాంపస్ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ బాసర క్యాంపస్ పూర్వ వైభవం తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు.

జలదిగ్బంధంలో కామాయి గ్రామం



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

సాత్నాల: భోరజ్ మండలంలోని కామాయి గ్రామానికి చిరుజల్లులు పడితేనే రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామంలో దాదాపు 600 మంది నివసిస్తున్నారు. పెన్ గంగ నది పరీవాహక ప్రాంతంలో ఉండే ఈ గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి వచ్చే రహదారిపై లోలెవల్ వంతెన ఉండటంతో చిన్నవర్షానికే బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. కుడివైపున పెన్‌గంగా, ఎడమవైపు లో లెవల్ వంతెనపై వరదనీరు పొంగిపొర్లడంతో బుధవారం సాయంత్రం వరకు గ్రామస్తులు జలదిగ్బంధంలో కూరుకుపోయారు. సాయంత్రం 7 గంటల తర్వాత బ్రిడ్జి పైన వరద నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలు పునరుద్ధరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


డ్రైవర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

రెబ్బెన: ఇటీవల ట్రాక్టర్ బోల్తాపడి పులికుంట గ్రామానికి చెందిన దుర్గం మారుతి మృతి చెందగా మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం పులికుంట వద్ద జాతీయ రహదారిపై మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. ట్రాక్టర్ యజమాని మృతుడి కుటుంబానికి రూ. 5లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రాక్టర్ యజమాని వచ్చి న్యాయం చేస్తానని హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. సుమారు 45 నిమిషాల పాటు రాస్తారోకో చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపుల భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు విషయాన్ని ఏఎస్పీ చిత్తరంజన్ దృష్టికి తీసుకెళ్లగా హుటాహుటిన ఆయన సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గురువారం ట్రాక్టర్ యజమానిని పిలిపించి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దాంతో రాస్తారోకో విరమించారు.

ప్రాజెక్టులో యువకుడి మృతదేహం లభ్యం



అడ్డెల రఘు (ఫైల్)

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులో చేపలు పట్టడానికి వచ్చి గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బొక్కలగూడ కాలనీకి చెందిన అడ్డెల రఘు(24) తన స్నేహితుడితో కలిసి సరదాగా ప్రాజెక్టు వద్దకు మంగళవారం చేపలు పట్టడానికి వచ్చారు. చేపలు పట్టే క్రమంలో ప్రాజెక్టు గేట్ల సమీపంలో రఘు ఒక్కసారిగా అదుపు తప్పి నీటిలో పడిపోయి గల్లంతయ్యాడు. తన స్నేహితుడు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం నీటిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి సోదరుడు అజయ్‌ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రణయ్ కుమార్ తెలిపారు.

బాధితుడికి నష్టపరిహారం అందజేత

కాసిపేట: మండలంలోని వెంకటపూర్ గ్రామానికి చెందిన రైతు బుద్దె రాజలింగుకు చెందిన లేగదూడ పెద్దపులి దాడిలో మృతి చెందగా బాధితుడికి అటవీశాఖ ఆధ్వర్యంలో 24గంటల్లో నష్టపరిహారం అందజేశారు. ముత్యంపల్లి సెక్షన్ పరిధి మల్కేపల్లి బీట్‌లో మంగళవారం పెద్దపులి దాడిలో లేగదూడ మృతి చెందగా బుధవారం బాధిత రైతుకు బెల్లంపల్లి రేంజ్ కార్యాలయంలో రేంజ్ అధికారి పూర్ణచందర్ రూ. 20వేల నష్టపరిహారం అందజేశారు. డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, ఎఫ్‌బీవో శ్రీధర్ పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

జైపూర్: మండలంలోని దుబ్బపల్లి గ్రామ శివారులో బుధవారం కొంతమంది వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఎస్సై మాట్లాడుతూ కోడి పందెం ఆడుతున్న సీసీసీ, నస్పూర్‌కు చెందిన గడ్డం సతీశ్, లక్షెట్టిపేట కుమ్మగూడెంకు చెందిన లశెట్టి సురేశ్, శ్రీరాంపూర్ తీగలపహాడ్‌కు చెందిన కట్కూరి రాజేశ్‌లను పట్టుకోగా ఇందారం గ్రామానికి చెందిన కూరగాయల శ్రీకాంత్, యతిరాజు వంశీ, మహేశ్, వైద్య గణేశ్‌లు, టేకుమట్ల గ్రామానికి చెందిన గోనె శరత్, గోదావరిఖనికి చెందిన పాకి సందీప్, నస్పూర్‌కు చెందిర రంగు సాయి, అరుణక్కనగర్‌కు చెందిన ఉదయ్‌లు పోలీసులను చూసి పారిపోయినట్లుగా తెలిపారు. పట్టుబడిన నిందితుల వద్ద ఒక్క కోడి, 31కోడి కత్తులు, రూ.3840లు, మూడు సెల్ ఫోన్లు, ఏడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు.

చెన్నూర్ ఎంఈవోపై విచారణ

చెన్నూర్: మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తిపై డీటీఎఫ్ ఫిర్యాదు మేరకు విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.లలిత బుధవారం విచారణ చేపట్టారు. ఎంఈవో విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని, ఉపాధ్యాయుల సర్వీసు బుక్ రికార్డు పూర్తి చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. విచారణ నివేదిక డీఈవోకు నివేదించనున్నట్లు లలిత తెలిపారు.